సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం । 13 । ఏప్రిల్ । 2024





## గుప్తనిధుల తవ్వకాలు

నల్లమల ప్రాంతంలో గుప్తనిధుల తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

వివరాలు 12లో ▸



## నగదు పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న తనిఖీల్లో నగదు పట్టుబడుతోంది.

వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
39.9 /23.6

## వాతావరణం

ఉదయం ఉంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు బలంగా వీస్తాయి. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### స్ట్రాంగ్‌రూంలో భద్రత ఏర్పాట్ల పరిశీలన



**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ బ్యాలెట్ బాక్సులను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంను శుక్రవారం కలెక్టర్ రవినాయక్ పరిశీలించారు. ముఖ్యంగా అక్కడి భద్రత ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు.

### మెడికల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



**పాలమూరు:** కాళోజీ నారాయణరావు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఇంటర్‌మెడిక్స్ స్పోర్ట్స్ పోటీల్లో పాలమూరు ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు క్రికెట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతి సాధించారు. దీంతో క్రికెట్‌లో గెలుపొందిన మహిళ మెడికో విద్యార్థులను కళాశాల డైరెక్టర్ రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల కోసం ప్రతి ఏడాది ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉంటే విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించే అవకాశం ఉందన్నారు. సదరు పోస్టును ప్రభుత్వం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ అధ్యాపకుడు డాక్టర్ కిరణ్ ప్రకాష్ పాల్గొన్నారు.

### నేడు వామపక్షాల జిల్లా సదస్సు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** జిల్లా సీఐటీయూ కార్యాలయంలో శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కురుమూర్తి తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ దేశంలో మతతత్వ, కార్పొరేట్ విధానాలను అవలంభిస్తోందని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దె దింపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా వామపక్ష రాష్ట్ర నాయకులు భూపాల్, బాలమల్లేష్, కృష్ణ హాజరవుతారన్నారు. ఇందులో వామపక్ష పార్టీల కార్యకర్తలు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శులు రాములు, బాలకృష్ణన్, సీహెచ్ రామచందర్, వామపక్ష నాయకులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, రాము పాల్గొన్నారు.

### బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలి



**జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్):** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలను అవలంభిస్తూ.. ప్రజల మధ్య దూరం పెంచుతోందని వామపక్ష పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, సీపీఐ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రామచందర్ హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, అందుకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ వైఖరిని ఎండగట్టేందుకు వామపక్ష పార్టీలు ఒక్కతాటిపైకి వచ్చి పోరాటం చేస్తాయన్నారు. అందులో భాగంగా శనివారం సీఐటీయూ కార్యాలయంలో వామపక్ష పార్టీల జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర నాయకుడు భూపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బలమల్లేష్, ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారని, పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

### యువతా మేలుకో..!

- ఓటుహక్కు నమోదు కోసం మూడు రోజులే గడువు

- వివరాలు 10లో..

# వన్యప్రాణాలు కాపాడుతూ..

**నల్లమలలో సాసర్ల ద్వారా నీటిని అందిస్తున్న అటవీ శాఖ**

- సహజ సిద్ధంగా నీళ్లు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు
- ఎండలు పెరగడంతో ఎండుతున్న వాగులు, చెక్‌డ్యాంలు, కుంటలు
- దాహార్తి తీర్చుకునేందుకు జనావాసాల్లోకి పరుగులు
- శివారులో అడవి జంతువులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని అధికారుల సూచన



నీటి కుంటలో నీరు తాగుతున్న అటవీ జంతువులు

**అచ్చంపేట:** ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండటంతో మనుషులు మొదలుకొని పశుపక్షాదులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో.. వాగులు, వంకలు, ఊటకుంటలు, చెలిమెలు, చెక్‌డ్యాంలు పూర్తిగా ఎండిపోయాయి. ఈ పరిస్థితుల్లో అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లో వన్యప్రాణులు తాగేందుకు నీరు దొరకడం లేదు. దీంతో అడవి జంతువులు దాహం తీర్చుకునేందుకు పంట పొలాలు, జనావాసాల వైపు పరుగులు తీస్తూ.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి. వ్యవసాయ బావుల్లో పడటమో.. వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకోవడమో జరుగుతుంది. ప్రతిఏటా ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండేది. ఈసారి మార్చిలోనే ఎండలు ఎక్కువ కావడంతో సమస్య మరింత జటిలమైంది. అయితే మూగజీవాల దాహం తీర్చడంతోపాటు వాటి మనుగడకు ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

**జంతువుల ఆవాసాల్లోనే..**

అమ్రాబాద్ పులుల అభయారణ్యం 2,611.39 చదరపు కి.మీ., మేర విస్తరించి ఉంది. ఇందులో 2,166.37 చ.కి.మీ., అభయారణ్యం కాగా 445.02 చ.కి.మీ., బఫర్ జోన్ ఉంది. నేషనల్ టైగర్ కన్జర్వేటర్ (ఎన్టీసీఏ) లెక్కల ప్రకారం ప్రస్తుతం 32 పులులు, 176 చిరుతలు ఉన్నాయి. అలాగే 300 ఎలుగుబంట్లు, 10 వేలకుపైగా అడవి పందులు, మచ్చల జింకలు, దుప్పులు, మనుబోతులు, ముళ్ల పందులు, నక్కలు, తోడేళ్లు, కొండ గొర్రెలు, కుందేళ్లు, నెమళ్లతోపాటు అరుదైన వివిధ రకాల పక్షులు, సర్పాలు, కీటకాలు, వృక్ష సంపద నల్లమల సొంతం. ప్రతిఏటా వన్యప్రాణుల సంతతి గణనీయంగా పెరుగుతోంది. అయితే ఎండాకాలంలో నీటి ఎద్దడితో అటవీ జంతువుల ఇబ్బందులు వర్ణనాతీతం. జంతువులు సాధారణంగా ఆహార అన్వేషణలో 4 కి.మీ., పరిధిలో తిరుగుతాయి. నల్లమలను అనుసరించి 140 కి.మీ., పరిధిలో కృష్ణానది ప్రవహిస్తుంది. అటవీ ప్రాంతంలో నిరంతరం నీళ్లు ఉండే సహజ జల వనరుల దగ్గర ఎక్కువగా ఉంటాయి. బల్మూర్ మండలం బిల్లకల్లు అటవీ ప్రాంతంలోని రుసుల చెరువులో మాత్రమే కొద్దిగా నీరు ఉంది. దీంతో అత్యధికంగా వన్యప్రాణులు అక్కడి వస్తుంటాయి.

**సోలార్ పంపులు**

ఏటీఆర్‌లో సోలార్ విద్యుత్ ద్వారా నడిచే పంపుల ద్వారా నీటి సౌకర్యం కల్పిస్తున్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో 30 సోలార్ పంపుల ద్వారా కుంటల్లోకి నీటిని పంపించే సౌకర్యం కల్పించారు. ఎండల తీవ్రతకు కుంటల్లో నీరు ఇంకిపోయే అవకాశం ఉంది. దీంతో సోలార్ పంపుల ద్వారా నీటిని కుంటల్లోకి వదులుతున్నారు.

**నిరంతరం పర్యవేక్షణ..**

రిజర్వు ఫారెస్ట్ పరిధిలో 80 వరకు నీటి కుంటలు, చెక్‌డ్యాంలు, పర్కులేషన్ ట్యాంక్‌లు, ఫాంపాండ్లను ఏర్పాటు చేశారు. నీటి ఊట ఉన్న ప్రదేశంలో బావిలా గుంత తవ్వి నీరు పడగానే వన్యప్రాణులు సులువుగా దిగి నీరు తాగేలా ర్యాంపు తయారు చేస్తారు. 3 మీటర్ల లోతు, 10 మీటర్ల వెడల్పుతో గుంత తవ్వుతారు. అందులోకి స్వచ్ఛమైన నీరు ఊటల ద్వారా చేరుతుంది. రెండు వైపులా ర్యాంపుల ఏర్పాటుతో వన్యప్రాణులు అందులోకి దిగి నీరు తాగుతాయి. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో 20 వరకు ఏర్పాటు చేశారు. వీటిని ప్రతి రెండ్రోజులకోసారి బేస్ క్యాంపు సిబ్బంది, బీట్ అధికారులు పర్యవేక్షిస్తారు.

**చర్యలు తీసుకుంటున్నాం..**



అడవిలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. అడవిలో పారే వాగులు, నీటి వనరులు ఉన్న ప్రదేశాల్లో సోలార్ పంపులు ఏర్పాటు చేశాం. నీటి ఆనకట్టలు, ర్యాంపు వెల్స్, చెలిమల ద్వారా సహజ సిద్ధమైన నీటిని వన్యప్రాణులకు అందించేందుకు చర్యలు చేపట్టాం. సీసీ సాసర్లను వినియోగం తగ్గించి సహజ సిద్ధంగా నీరందించేందుకు కృషిచేస్తున్నాం. వన్యప్రాణులు పొలాల వైపు వస్తే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఎవరైనా వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– రోహిత్‌గోపిడి, డీఎఫ్‌ఓ



ట్రాక్టర్ ద్వారా సాసర్‌లో నీటిని నింపుతున్న సిబ్బంది

**సహజ వనరులపై దృష్టి..**

నీటి కుంటలు, సోలార్ పంపులు, ర్యాంపు వెల్స్ లేని ప్రదేశాల్లో ఎత్తైన ప్రాంతంలో 1,150 సీసీ సాసర్లు ఏర్పాటు చేశారు. వీటిలో ట్యాంకర్ ద్వారా నీరు నింపి వన్యప్రాణులకు అందిస్తారు. బేస్‌క్యాంపు సిబ్బంది, బీట్ అధికారులు నాలుగు రోజులకోసారి సాసర్లను నింపే విధంగా ఆదేశాలు జారీ చేశారు. ఐసీఐసీ ఫౌండేషన్ నుంచి 5 ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకులను ఉచితంగా అందజేశారు. వీటి ద్వారా కొన్ని రేంజ్‌ల పరిధిలో నీరు సరఫరా చేస్తున్నారు. గతంలో అత్యధికంగా సాసర్ల ద్వారా అందించేవారు. దీంతో ట్రాక్టర్ శబ్దంతో వన్యప్రాణులు భయపడే అవకాశం ఉన్నందున ఈ పద్ధతి కొంత మేర తగ్గించి సహజ వనరులపై దృష్టిసారించారు. నిఘా ఉంచేందుకు ఒక్కో సాసర్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

## 20 నుంచి హెచ్‌సీఏ వేసవి క్రికెట్ శిబిరాలు

**మహబూబ్‌నగర్ క్రీడలు:** గ్రామీణ ప్రాంతాల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి వచ్చే నెల 20 వరకు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానం పెవిలియన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఐదు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మహబూబ్‌నగర్‌లోని క్రికెట్ మైదానం, గద్వాలలోని డీఎస్‌ఏ మైదానం, జడ్చర్లలోని డిగ్రీ కళాశాల మైదానం, కల్వకుర్తిలోని డీఎస్‌ఏ మైదానం, నాగర్‌కర్నూల్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో వేసవి శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ శిక్షణ కేంద్రాల్లో నిష్ణాతులైన కోచ్, ట్రైనర్ ఉంటారని, అదేవిధంగా క్రీడాకారుల కోసం మ్యాట్‌లు, నెట్‌లతోపాటు జంబో కిట్‌లు అందుబాటులో ఉంచుతామన్నారు. ఉదయం 5.30 నుంచి 8.30 గంటల వరకు కోచింగ్ ఉంటుందని, క్రీడాకారులకు అల్పాహారం అందిస్తామన్నారు. ఆసక్తిగల అండర్- 10 నుంచి అండర్- 23 ఏళ్లలోపు క్రీడాకారులు ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

**టీడీఎల్‌లో అవకాశం..**

వేసవి శిబిరాల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు వచ్చే నెల 20వ తేదీ తర్వాత హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ డిస్ట్రిక్ లీగ్ (టీడీఎల్) టీ-20 లీగ్‌లో అవకాశం లభిస్తుందని రాజశేఖర్ చెప్పారు. ఐదు శిబిరాల క్రీడాకారులకు మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ క్రీడాకారులతో ఈ లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా సీనియర్ జట్టును ఎంపిక చేస్తామన్నారు. అలాగే హెచ్‌సీఏ టోర్నీలకు ఎంపిక చేస్తామని, రాణించే క్రీడాకారులకు హెచ్‌సీఏ టాలెంట్ హబ్ అకాడమీల్లో అవకాశం దక్కుతుందన్నారు. సమావేశంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

# ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు



జెండా ఊపి పరుగు ఎంపికలను ప్రారంభిస్తున్న మనోహర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ క్రీడలు:** జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ సంఘం మాజీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మనోర్‌రెడి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో నిరంతర సాధన చేస్తే విజయాలు సాధించవచ్చన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలన్నారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర మాట్లాడుతూ ఈ ఎంపికలకు జిల్లావ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు చెప్పారు. అండర్- 14, 16, 18, 20 విభాగాలతోపాటు పురుషులు, మహిళలకు వేర్వురుగా మిడిల్, లాంగ్ డిస్టెన్స్ పరుగులో ఎంపికలు నిర్వహించామన్నారు. ఈ నెల 28న సూర్యాపేటలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు ఆనంద్, సునీల్‌కుమార్, సాధిక్‌అలీ, జిల్లా అథ్లెటిక్స్ సంఘం సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, రాజు, నరసింహ, లోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతలపై దృష్టి

- 350 గజాలుంటే తప్పనిసరి.. లేనివారు ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు
- భూగర్భజలాలు అడుగంటుతున్న తరుణంలో ముందస్తు చర్యలు
- జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న సర్వే

**జడ్చర్ల టౌన్:** భూగర్భజలాలు అడుగంటుతున్న తరుణంలో మరోసారి ఇంకుడు గుంతల నిర్మాణం తెరపైకి వచ్చింది. అయితే ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో ఇంకుడు గుంతల సర్వే ప్రారంభం అయ్యింది. సెలవు దినాలు ఉన్నప్పటికీ మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలైన మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్‌లలో గురువారం నుంచి సర్వే ప్రారంభించారు. ఆదివారంలోగా పూర్తిచేయాలని సిబ్బందిని పురమాయించారు. 2019 చట్టం ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే ఇంకుడుగుంత ఉండాల్సిందే. గుంత నిర్మాణం చేసేలా ఇంటి ప్లాన్ ఉంటేనే అనుమతులు ఇస్తున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. గృహ నిర్మాణం చేస్తున్న వారెవరూ ఆ నిబంధన పాటించడం లేదు. దీంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. మరోవైపు ఎక్కడపడితే అక్కడ మురుగు నిలిచి దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇటీవల కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో నీటి ఎద్దడి, అడుగంటిన భూగర్భజలాల వల్ల ఏర్పడిన ఇబ్బందుల నేపథ్యంలో సుభాష్‌చంద్రన్ అనే వ్యక్తి రాష్ట్ర పరిస్థితులు, ఇంకుడు గుంతల ప్రాధాన్యత, నిర్మాణాలు లేని వైనంపై హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం 350 గజాల ఇంటిలో ఇంకుడు గుంత తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీచేసింది.

**జిల్లా పరిధిలో ఇలా..**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 49 వార్డులు ఉండగా.. 49 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ అత్యధికంగా అపార్ట్‌మెంట్లు, 350 గజాలకుపైగా నిర్మించుకున్న ఇళ్లు 2 వేల వరకు ఉన్నట్లు అంచనా. సర్వే నిమిత్తం మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 20 బృందాలు పనిచేస్తున్నాయి.



జడ్చర్ల మున్సిపాలిటీలోని 3వ వార్డులో ఇంకుడు గుంతల సర్వే చేస్తున్న సిబ్బంది

- జడ్చర్ల మున్సిపాలిటీలో 27 వార్డులు ఉండగా.. 15 వేలకుపైగా ఇళ్లు ఉన్నాయి. 350 గజాలు, ఆపై నిర్మాణం చేపట్టిన ఇళ్లు 600లకుపైగా ఉన్నట్లు అంచనా. ఇక్కడ 9 బృందాలు ఇంటింటికి తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నారు.
- భూత్పూర్‌లో 10 వార్డులు ఉండగా.. 2,400లకు పైగా ఇళ్లు ఉన్నాయి. భూత్పూర్‌లో 10 బృందాలు గురువారం నుంచి సర్వే చేయడం ఆరంభించారు. ఒక్కో బృందంలో నలుగురు సభ్యులతో వార్డులు సర్వే నిర్వహించేలా ఆదేశించారు. సర్వేలో ఇళ్లతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు, ఆస్పత్రులు, పరిశ్రమలు అన్నింటిని గుర్తిస్తున్నారు. గురువారం ప్రారంభమైన సర్వే ఆదివారంతో ముగియనుంది. అయితే అపార్ట్‌మెంట్లలో ఇంకుడు గుంతల నిర్వహణ సక్రమంగానే ఉందని సర్వే ద్వారా తెలుస్తుంది. మిగిలిన ఇళ్లలో మాత్రం చాలా వరకు ఇంకుడు గుంతలు నిర్మాణం చేయనట్లే కనిపిస్తోంది.

**నోటీసులు జారీ.. అవగాహన**

ఇంకుడు గుంతలు లేని ఇంటి యజమానులకు ఏర్పాటు చేసుకోవాలని మున్సిపాలిటీ నుంచి నోటీసులు అందజేస్తున్నారు. ఇంకుడు గుంత వల్ల కలిగే ప్రయోజనాలను అవగాహన కల్పిస్తున్నారు. వేసవి కావడం వల్ల ఇప్పుడే ఏర్పాటు చేసుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

**జియో ట్యాగింగ్..**

ఇంకుడు గుంతలు ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, ఆస్పత్రులు, పాఠశాలలను జియో ట్యాగింగ్ చేస్తున్నారు. సర్వే సిబ్బంది జియో యాప్‌లో నమోదు చేయడం వల్ల ఇంకుడు గుంతలు ఉన్న ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తమవుతాయి.

**ప్రయోజనాలు వివరిస్తున్నాం..**



జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో 27 వార్డులుండగా 9 బృందాలతో ఇంకుడు గుంతల సర్వే నిర్వహిస్తున్నాం. ఒక్కో బృందంలో నలుగురు సభ్యులు అన్ని ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ప్రధానంగా 350 గజాలు, ఆపై స్థలంలో నిర్మించిన ఇళ్లలో తప్పనిసరిగా ఇంకుడు గుంత ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు లేని వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. ఇంకుడు గుంతలతో ప్రయోజనాలు వివరించి నిర్మించుకునేలా చూస్తున్నాం.

– రాజయ్య, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

## ఎంపీ అభ్యర్థి తానే అని.. గెలుపునకు కృషిచేయాలి



మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

**భూత్పూర్:** ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నేనే ఎంపీ అభ్యర్థి అనే భావనతో తన గెలుపు కోసం కృషిచేయాలని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భూత్పూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తకు రాబోయే రోజుల్లో అధిక ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కార్యకర్తల బలంతోనే నాకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా బరిలో దింపారని చెప్పారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని, కాంగ్రెస్ కార్యకర్త చెప్పిన వారికే సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఆరు గ్యారంటీలతోపాటు రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, కనీస మద్దతు ధర కల్పించడం జరుగుతుందన్నారు. 19న ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తానని, ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నట్లు చెప్పారు. మెట్టుగడ్డ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు ఉదయం 9.30 గంటలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ భూత్పూర్ నుంచి పెబ్బేర్ జాతీయ రహదారి పక్కన పరిశ్రమలు నెలకొల్పడానికి సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని, ఇందుకోసం ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని తనకు చెప్పారని వివరించారు. పాలమూరు అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టిపెట్టారన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చే వారి కంటే కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తకే మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, అన్వర్‌పాష, సంజీవరెడ్డి, మోహినొద్దీన్, గోవర్ధన్ గౌడ్, ఎంపీటీసీ సభ్యులు ఊషన్న, పుల్లయ్య, సాయిలు, హర్యానాయక్, విజయ్‌గౌడ్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

## హోదా మరిచి మాట్లాడుతున్న సీఎం



బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న డీకే అరుణ

**మద్దూరు:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికీ జెడ్పీటీసీ స్థాయిలోనే మాట్లాడుతున్నారని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఎద్దేవా చేశారు. శుక్రవారం మద్దూరులో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అరుణమ్మ జాతీయ హోదా తీసుకురాలేదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. తాను పార్టీకి జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్నానని.. ఎంపీగా గెలిచి, కేంద్ర మంత్రి పదవిలో ఉంటే జాతీయ హోదా గురించి మాట్లాడితే బాగుండేదన్నారు. గతంలో ఇక్కడి నుంచి గెలుపొంది, కేంద్రంలో మంత్రి పదవులు అనుభవించిన జైపాల్‌రెడ్డి కూడా ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడలేదని తెలిపారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలకు బీజం పడిందని చెప్పారు. నెట్టెంపాడు, కల్వకుర్తి తదితర ఎత్తిపోతల పథకాలకు నిదులు తీసుకొచ్చి, రైతాంగానికి సాగునీళ్లు అందించానని గుర్తుచేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీయే పాలమూరు ఎత్తిపోతలపై సమగ్రంగా పునఃసమీక్షించి పనులు మొదలుపెట్టాలని సూచించారు. తాను గెలుపొందిన తర్వాత కేంద్రంలోని మోదీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. ఇటీవల కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడుతూ.. తనపై అరుణమ్మ కుట్ర చేస్తుందని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి మూడుసార్లు గెలుపొంది, నియోజకవర్గానికి చేసిందేమీలేదని అన్నారు. దేశ సమగ్రాభివృద్ధి కోసం మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. కాగా, మద్దూరు ఎంపీటీసీ వెంకటయ్య, మరికొందరు డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాస్, రమేష్, ప్రతాప్‌రెడ్డి, శంకర్, వెంకట్‌రెడ్డి, సాయిలు, భరత్, కాశీ, సుధాకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

## క్లుప్తంగా

### పిడుగుపాటుతో మహిళా రైతు మృతి

**ఉప్పునుంతల:** పిడుగుపాటుకు గురై ఓ మహిళా రైతు మృతిచెందిన ఘటన మండలంలోని తాడూరులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుండెమోని శ్యామల (34) రోజు మాదిరిగానే ఉదయం పొలానికి వెళ్లింది. సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో వేప చెట్టు కింద కూర్చుంది. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. కాసేపటికి పొలానికి వచ్చిన చిన్న కుమారుడు యశ్వంత్ తల్లి మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. శ్యామలకు భర్త పర్వతాలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఏఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### వృద్ధుడి బలవన్మరణం


లచ్చిరాం నాయక్ (ఫైల్)

**చారకొండ:** నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని తుర్కలపల్లి పంచాయతీ పరిధి నూకలచింతవాడిక తండాలో ఓ వృద్ధుడు శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. తండాకు చెందిన లచ్చిరాంనాయక్ (62) తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో నిత్యం గొడవ పడేవాడు. మద్యం తాగొద్దని కుమారులు సూచించడంతో మనస్తాపానికి గురై వ్యవసాయ పొలంలో పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే వాహనంలో వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. లచ్చిరాంనాయక్ భార్య మృతిచెందగా.. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

### డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

**కల్వకుర్తి టౌన్:** మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలుశిక్ష పడిందని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించగా.. అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న గడ్డం శ్రీనివాస్, శివప్రసాద్‌ను పట్టుకున్నారు. వీరిద్దరిని కల్వకుర్తి జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి కావ్య ఎదుట హాజరుపరచగా.. వీరిద్దరిలో శ్రీనివాస్‌కు మూడు రోజులు, శివప్రసాద్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధించిందని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా మద్యం తాగి, సరైన వాహన పత్రాలు లేకుండా, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

### 8 మట్టి ట్రాక్టర్ల పట్టివేత

**ఎర్రవల్లిచౌరస్తా:** ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఉదండాపురం, పెద్దదిన్నె గ్రామాల సమీపంలో ప్రభుత్వానికి సంబంధించిన పొలం నుంచి ట్రాక్టర్ల ద్వారా గురువారం అర్ధ రాత్రి అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. ఈ క్రమంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తనిఖీ చేసి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం వాటిని పీఎస్‌కు తరలించి ట్రాక్టర్ల డ్రైవర్లతో పాటు యజమానులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### 30 గ్రాముల గంజాయి..

**నాగర్‌కర్నూల్ క్రైం:** ఓ వ్యక్తి వద్ద గంజాయి పట్టుబడిందని చేసుకున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా పెద్దకొత్తపల్లికి చెందిన విశ్వస్వరూప్ వద్ద 30 గ్రాముల గంజాయి ఉండటంతో స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి తీసుకొచ్చినట్లు నిందితుడు ఒప్పుకోవడంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

### పీడీఎస్ బియ్యం స్వాధీనం



**అయిజ:** మండలంలోని వెంకటాపురం స్టేజ్ వద్ద శుక్రవారం పోలీసులు 450 కిలోల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. మాన్‌దొడ్డి నుంచి అదే గ్రామానికి చెందిన పరశురాం ఆటోలో అక్రమంగా పీడీఎస్ బియ్యంను తరలిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకొని, దాడులు నిర్వహించి ఆటోను నిలిపివేశారు. ఆటోను, బియ్యంను స్వాధీనం చేసుకొని పరశురామ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలియజేశారు.

# యువతా.. మేలుకో!

## ఓటు విలువ తెలుసుకో.. నమోదు చేసుకో



- ఓటుహక్కు పొందేందుకు మూడురోజులే గడువు
- జిల్లాలో యువ ఓటర్లే అధికం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 17,34,773..
- మహబూబ్‌నగర్‌లో 16,80,417 మంది ఓటర్లు

**అచ్చంపేట:** ఐదేళ్లు పాలించే ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ కట్టలేం. ఓటు వేయకుంటే ప్రశ్నించే హక్కు కోల్పోతాం. ఈ విషయమై ఓటు చైతన్యంపై జిల్లా యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించింది. ఇందులో భాగంగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుంది. మే 13న పోలింగ్ జరుగనుంది. ఈనెల 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. 2006 మార్చి 31లోగా పుట్టిన వారంతా ఓటరుగా పేరు నమోదు చేసుకోవచ్చు. ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది. దీన్ని సద్వినియోగించుకుంటే ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇప్పటికే బూత్ లెవల్ అధికారి(బీఎల్‌ఓలు) తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పరిశీలించి పేరు లేకుంటే నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**విద్యార్థి లోకం కదలాలి..**

ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సుల్లో తొలి ఏడాది పూర్తయిన వారు 18ఏళ్ల నిండిన జాబితాలోకి వస్తుంటారు. ఎన్నికల సంఘం సూచన మేరకు ఓటు హక్కు నమోదుపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో యువ ఓటర్ల సంఖ్యే అధికం. 18–39 ఏళ్ల వయస్సు కలిగిన వారిని యువ ఓటర్లుగా పరిగణిస్తారు.

### 25న అనుబంధ జాబితా..

ఎవరైతే కొత్త ఓటర్లుగా, మార్పులకు దరఖాస్తు చేసుకుంటారో వారి వివరాలను అధికారులు వారం రోజుల్లో పరిశీలిస్తారు. అర్హులని తేలితే ఈ నెల 25వ తేదీన విడుదల చేసే అనుబంధ జాబితాలో పేర్లు ప్రచురిస్తారు. సాధారణ ఓటరు జాబితాలో ఉన్నవారితో పాటు అనుబంధ జాబితాలోని ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

### గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో..

2023 శాసనసభ ఎన్నికలకు ముందు తరహాలో యువ ఓటర్ల నమోదుకు అధికారులు ప్రోత్సహించారు. నవంబరు 30న పోలింగ్ జరగగా.. నెల ముందు వరకు అంటే అక్టోబరు 31 వరకు ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. పరిశీలన అనంతరం నవంబరు 17న ఓటరు తుది జాబితా ప్రకటించారు. గత జాబితాతో పోల్చితే ఉమ్మడి జిల్లా లోని 14 నియోజకవర్గాల్లో సుమారు 45వేల మంది యువ ఓటర్ల సంఖ్య పెరిగింది. ఈ సారి కూడా ఏప్రిల్ 1 వరకు 18ఏళ్ల నిండిన వారందరికీ అవకాశం కల్పించడంతో అదేస్థాయిలో ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్ల వివరాలు..**

| అసెంబ్లీ | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 1,28,268 | 1,30,377 | 13 | 2,58658 |
| జడ్చర్ల | 1,11,354 | 1,11,863 | 05 | 2,23,222 |
| దేవరకద్ర | 1,18,372 | 1,20,705 | 00 | 2,39,077 |
| మక్తల్ | 1,19,254 | 1,23,863 | 01 | 2,43,338 |
| నారాయణపేట | 1,16,261 | 1,19,254 | 02 | 2,35,517 |
| కొడంగల్ | 1,19,37 | 1,23,020 | 10 | 2,42,267 |
| షాద్‌నగర్ | 2,19,114 | 1,19,211 | 13 | 2,38,338 |

**నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్ల వివరాలు..**

| అసెంబ్లీ | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| వనపర్తి | 1,35,367 | 1,37,282 | 04 | 2,72,653 |
| జో., గద్వాల | 1,25,356 | 1,30,499 | 11 | 2,55,866 |
| అలంపూర్ | 1,17,997 | 1,21,074 | 08 | 2,39,079 |
| నాగర్‌కర్నూలు | 1,18,764 | 1,19,366 | 3 | 2,38,133 |
| అచ్చంపేట | 1,23,234 | 1,24,382 | 05 | 2,47,621 |
| కల్వకుర్తి | 1,22,605 | 1,20,148 | 09 | 2,42,962 |
| కొల్లాపూర్ | 1,20,511 | 1,17,943 | 05 | 2,38,459 |

**సవరణకు అవకాశం**

ముందుగా ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవాలి. చాలా మంది వయోజనులు పోలింగ్‌కు ఒక రోజు ముందు తమకు ఓటరు చీటి రాలేదంటూ బూత్‌స్థాయి అధికారి వద్దకు వెళ్తారు. ఈ సమయంలో జాబితాలో పేరు కనిపించకపోతే అప్పటికప్పుడు పేరు నమోదు చేయడం సాధ్యం కాదు. జాబితాలో పేరు లేకుంటే ఓటరు వేయడానికి సిబంధనలు అంగీకరించవు. జాబితాలో పేరు లేకుంటే 18ఏళ్లు నిండిన వారు ఫారం–6 పూరించాలి. సంబంధిత ధ్రువపత్రాలు, ఫొటోలను బూత్‌స్థాయి అధికారికి ఇవ్వాలి. ఇందుకు ఈ నెల 15 వరకు అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో vote.eci.gov.in వెబ్‌సైట్‌లో పేరు ఉందా లేదా చూసుకోవడంతో పాటు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవచ్చు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరుండి ఇళ్లు మారి ఉంటే ఇప్పుడు ఉంటున్న ప్రాంతానికి పేరు, పోలింగ్ కేంద్రం మార్చుకునేందుకు అవకాశం ఉంది. ఇందుకు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు జాబితాలో పేరు తొలగించేందుకు ఫారం–7 అవసరం. ఇలా నివాసం, గ్రామం, మండలం, నియోజకవర్గం,పోలింగ్ కేంద్రం వంటి విషయాల్లో మార్పులు ఉన్నా సరిచేసుకోవచ్చు.

# అనాథలైన అక్కాచెల్లెళ్లపై అధికారుల ఆరా

**భూత్పూర్:** మూసాపేట మండలం నందిపేటకి చెందిన మణెమ్మ మృతిచెందడంతో ముగ్గురు కుమార్తెలు శ్రీలత, శిల్ప, వెన్నెలు అనాథులుగా మారిన విషయం విధితమే. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఐసీడీఎస్ అధికారులకు అనాథ పిల్లల సమాచారం ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో నందిపేటకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త అనాథ పిల్లల వివరాలు సేకరించారు. ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. దీంతో తల్లి మణెమ్మ దశదినకర్మ పూర్తయిన తర్వాత తెలియజేస్తామని కుటుంబ పెద్దలు చెప్పినట్లు తెలిసింది.

# గుట్టుగా లింగ నిర్ధారణ

## ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ కరువు



- యథేచ్ఛగా సాగుతున్న లింగ నిర్ధారణ, అబార్షన్లు
- కాసుల కోసం కక్కుర్తి పడుతున్న ఆర్ఎంపీలు
- నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు
- కలెక్టర్ సమీక్ష నిర్వహించినా ఫలితం శూన్యం

**నాగర్‌కర్నూల్ క్రైం:** మాతృత్వం మహిళకు ఒక గొప్ప వరం. ఆడ.. మగ అనే వివక్ష లేకుండా ఇద్దరిని సమానంగా చూడాల్సిన సమాజంలో నేటికీ ఆడపిల్లలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, తెలుసుకోవడం నేరమైనప్పటికీ.. కొందరు వైద్యులు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. పలు ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో గుట్టుగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 158 ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా.. 58 స్కానింగ్ సెంటర్లు కొనసాగుతున్నాయి. 21 స్కానింగ్ సెంటర్లు పనిచేయడం లేదని సమాచారం. వైద్యారోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కొన్ని ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలతో పాటు అబార్షన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న విజయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో చాలా రోజులుగా స్థాయికి మించి వైద్యంతో పాటు అబార్షన్లు సైతం చేస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు రావడంతో ఈనెల 6న తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రథమ చికిత్స కేంద్రంలోని మందులు, పలు స్కానింగ్ సెంటర్లకు సంబంధించిన రిపోర్టులను అధికారులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అయితే అధికారులు స్వాధీనం చేసుకున్న స్కానింగ్ రిపోర్టులు ఏ సెంటర్లకు సంబంధించినవనే విషయాలపై సమగ్ర విచారణ జరిపితే, మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే ఆస్కారం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


జిల్లాకేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

### కనిపించని మార్పు..

జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో పాటు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో ఇటీవల కలెక్టర్ ఉదయ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా మార్పు కనిపించడంలేదు. అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలలోని ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు నిఘా పెంచడంతోపాటు తరుచూ తనిఖీలు, సమీక్షలు నిర్వహిస్తే మార్పు వచ్చే అవకాశం ఉంది. లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు నిర్వహించే ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల అనుమతులను శాశ్వతంగా రద్దు చేస్తే, అందరిలో భయం ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**చర్యలు తీసుకుంటాం..**



జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే, చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. జిల్లా కేంద్రంలోని విజయ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో స్థాయికి మించి వైద్యం చేయడంతో పాటు అబార్షన్లు చేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఇటీవల తనిఖీలు నిర్వహించి, మందులతో పాటు పలు స్కానింగ్ సెంటర్ల రిపోర్టులను స్వాధీనం చేసుకొని సీజ్ చేశాం. ఎక్కడయిన లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌ఓ

### స్థాయికి మించి వైద్యం..

జిల్లాలో దాదాపు 300 మందికి పైగా ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వీరిలో కొందరు స్థాయికి మించి వైద్యం అందిస్తూ, రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రంలో ఇటీవల మహిళకు అబార్షన్ చేయగా తీవ్ర రక్తస్రావమైంది. ఆమెను చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా జిల్లా ఆస్పత్రికి ఎదురుగా ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లలో పలువురు చికిత్స కోసం వచ్చి, మృత్యువాత పడ్డ ఘటనలు లేకపోలేదు. కొన్ని ప్రైవేటు స్కానింగ్ సెంటర్లతో ఆర్ఎంపీలు కుమ్మక్కయి, లింగ నిర్ధారణ పరీక్షలు సైతం చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# బేకరీ నిర్వాహకులపై దాడి

- ఇద్దరికి తీవ్రగాయాలు

**గద్వాల క్రైం:** మద్యం మత్తులో కొందరు యువకులు బేకరి నిర్వాహకులపై దాడికి పాల్పడగా.. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గద్వాల పట్టణంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జిల్లా కేంద్రమైన గద్వాలలో కేరళకు చెందిన వ్యక్తులు నాలుగేళ్ల నుంచి బెస్ట్ బేకరి దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. అయితే గురువారం అర్ధరాత్రి గద్వాలకు చెందిన కొందరు యువకులు మద్యం మత్తులో దుకాణ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. మద్యం మత్తులో బేకరి నిర్వాహకులపై దాడి చేశారు. దీంతో బేకరి నిర్వాహకులైన అబ్దుల్ రషీద్, ఫరీద్‌కు తీవ్రగాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయడంతో 108 వాహనం అక్కడికి చేరుకుంది. వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే గొడవకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై పట్టణ రెండవ ఎస్ఐ రామును వివరణ కోరగా.. గొడవ జరిగిన అంశం మా దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలాఉండగా, దాడి ఘటనపై పలువురు చోట మోటా నాయకులు రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. దాడి చేసిన వారిలో గంజిపేటకు చెందిన శివమణి, కోట సమీపంలోని మియ్యా, హుస్సేన్ తదితరులు ఉన్నట్లు తెలుస్తోంది.

# చిరుత దాడిలో లేగదూడ మృతి

**బిజినేపల్లి:** చిరుత దాడిలో లేగదూడ మృతిచెందిన ఘటన మండలంలోని కీమ్యాతండా గ్రామపంచాయతీ శివారు అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తండాకు చెందిన రైతు పరశునాయక్ ఎప్పటిలాగే గురువారం సాయంత్రం తన వ్యవసాయ పొలంలో పశువులను కట్టేసి ఇంటికెళ్లాడు. రాత్రి చిరుత మందలోని లేగదూడను లాక్కెళ్లి తినేసింది. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతుకు లేగదూడ కనబడకపోవడంతో చుట్టుపక్కల వెదకగా ఓ ప్రాంతంలో దూడ కళేబరం కనిపించింది. బాధిత రైతు గ్రామస్తుల ద్వారా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించి నిర్ధారించారు.

**చిరుతకు హాని తలపెడితే చర్యలు..**

ఘనపూర్ అటవీ ప్రాంతం నుంచి గంగారం అటవీ ప్రాంతం వైపు ఆహారం కోసం వచ్చిన చిరుతకు ఎవరైనా హాని తలపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్ఓ పర్వేజ్ అహ్మద్ హెచ్చరించారు. చిరుత నష్టం చేస్తుందనే ఉద్దేశంతో ఎవరైనా విద్యుత్ తీగలు, వలలు ఏర్పాటు చేయడంగాని, విష ప్రయోగం వంటివి చేసి హాని తలపెట్టొద్దని సూచించారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు, రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పశువులను కాపాడుకోవాలని సూచించారు. పశువుల్ని మేత కోసం అటవీ ప్రాంతానికి తీసుకురావొద్దన్నారు. గతంలో సోలార్ బోర్లతో నీటి సంపులు ఏర్పాటు చేయడంతో జింకలు, ఇతర జీవుల సంఖ్య పెరిగిందని.. ఇక్కడ ఆహారం దొరుకుతుండటంతోనే చిరుత వచ్చిందని తెలిపారు. చిరుత సంచారంతో అడవికి, ఇతర వన్య ప్రాణులకు వేటగాళ్ల నుంచి రక్షణ ఉంటుందని వివరించారు. చిరుత దాడిలో మృతిచెందిన లేగదూడలకు అటవీశాఖ నుంచి నష్ట పరిహారం అందిస్తామన్నారు. చిరుతల సంఖ్యను లెక్కించేందుకు కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

# ఉరేసుకొని యువతి బలవన్మరణం


జ్యోతి (ఫైల్)

**కొడేరు:** వారిద్దరూ ఐదేళ్లుగా ప్రేమించుకున్నారు.. పెళ్లి విషయానికి వచ్చే సరికి సదరు యువకుడు.. తనకు కట్నం కింద ఎకరా భూమి కావాలని కోరడంతో మనస్తాపంతో యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కొడేరు మండలం నాగులపల్లి తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా.. రాత్లావత్ మీటునాయక్, బిచ్లి దంపతులకు ఇద్దరు కూతుళ్లు జ్యోతి (25), రాణి, కుమారుడు సాయిరాం ఉన్నారు. పెద్ద కూతురు జ్యోతి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో పని చేస్తుండేది. ఐదేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్‌కు చెందిన వీరబాబుతో పరిచయం ఏర్పడి ఇద్దరు ప్రేమించుకున్నారు. ఈక్రమంలోనే పెళ్లి చేసుకోవాలని అడగగా.. ఇప్పుడు అప్పుడు అంటూ దాటవేస్తు వచ్చాడు. నెల రోజుల క్రితం పెళ్లి విషయం ఎత్తగా.. తనకు కట్నం కావాలని, మీ వ్యవసాయ పొలం రాసివ్వాలని సదరు యువకుడు చెప్పాడు. దీంతో జ్యోతి వారం రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చింది. ఇన్నాళ్లు ప్రేమించి ఇప్పుడు కట్నం అడగడంతో మనస్తాపానికి గురైన యువతి శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం 3 గంటలకు చున్నీతో ఉరేసుకొని ఆత్యహత్య చేసుకుంది. కొంత సమయం తర్వాత కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ మహేష్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

# హాస్టల్ విద్యార్థికి విరిగిన కాలు


కాలు విరిగి ఆస్పత్రిలో ఉన్న విద్యార్థి శివకుమార్

**మన్ననూర్:** మన్ననూర్‌లోని పీటీజీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఆదిమజాతి చెంచు విద్యార్థికి కాలు విరిగిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పదర మండలం బాపన్‌పాడ్‌కి చెందిన శివకుమార్ మన్ననూర్‌లోని పీటీజీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం వర్షం చినుకులు పడ్డాయి. హాస్టల్ భవనంపైన కొందరు విద్యార్థులు ఉతికి ఆరవేసిన దుస్తులు తీసుకునే క్రమంలో మూట కట్టి కిందకు పడేశారు. అక్కడే నిలుచున్న శివకుమార్ కాలుపై దుస్తుల మూట పడింది. దీంతో ఎడమ కాలు విరిగింది. సంఘటన గురించి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేయకుండా సొంత నిర్ణయంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అదే పాఠశాలలో చదువుకుంటున్న బాధిత విద్యార్థి సోదరుడు జరిగిన విషయం తల్లిదండ్రులకు తెలియజేశాడు. దీంతో హుటాహుటిన పాఠశాల వద్దకు చేరుకున్న బాధిత విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థిని అచ్చంపేటకు తీసుకెళ్లి ఎక్స్‌రే తీయించారు. కాలు విరిగినట్లు నిర్ధారణ అయింది. విద్యార్థిపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులు, సిబ్బందిపై చర్యలు తీసుకొని విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నారు.

### రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు

**నారాయణపేట రూరల్:** ప్రభుత్వం నిర్ణయించిన మేరకు సీఎంఆర్ అందించలేదని ధన్వాడ మండలం కొండాపూర్ శివారులోని సాయికృష్ణ రైస్‌మిల్ యజమానిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు కలెక్టర్ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌తో కలిసి రైస్‌మిల్‌ను తనిఖీ చేయగా యజమాని రాజేందర్‌రెడ్డి రూ.1.80 కోట్ల విలువైన బియ్యాన్ని అందించకుండా పక్కదారి పట్టించినట్లు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పౌరసరఫరాలశాఖ డీఎం దేవదాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

### యాక్సిడెంట్‌లో గాయపడిన యువకుడు మృతి

**గోపాల్‌పేట:** రేవల్లి మండలంలోని గొల్లపల్లికి చెందిన అరవింద్ గురువారం ట్రాక్టర్ యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయపడిన అరవింద్‌ను వనపర్తి ఆస్పత్రి అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడని ఎస్ఐ తిరుపతిరెడ్డి తెలియజేశారు.

# మోసాలు కావాలా? మంచి కొనసాగాలా?

## పాలకుడు మోసగాడు అయితే బతుకులు అంధకారం అవుతాయి

### మీరే నా స్టార్ క్యాంపైనర్లు.. ఏటుకూరు సిద్ధం సభలో సీఎం జగన్



సభలో మాట్లాడుతున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'మోసాల చంద్రబాబు నుంచి మన రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునేందుకు జరుగుతున్న ఈ యుద్ధంలో మీరంతా ప్రతి ఇంటికి వెళ్లి గత 58 నెలలుగా జరిగిన మంచిని వివరించాలి. ప్రతి ఇంటికి వెళ్లి వాస్తవాలు వివరించి స్టార్ క్యాంపైనర్లుగా చేయాలి. ఈ మంచి కొనసాగాలంటే మీ బిడ్డ మళ్లీ రావాలి.. మోసపోకూడదంటే మీ బిడ్డకే ఓటు వడాలి అని ప్రతి గడపకూ చెప్పాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి గుంటూరు శివారు ఏటుకూరు వద్ద నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**అందరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ..**

ఈరోజు గుంటూరులో కనిపిస్తున్న ఈ మహా జన సముద్రం చరిత్రలో ఎప్పటికి నిలిచిపోతుంది. మనందరి ప్రభుత్వానికి మద్దతుగా ఇప్పుడు జరుగుతున్న మంచిని కాపాడుకునేందుకు, ఆ మంచిని కొనసాగించేందుకు ఇక్కడి కి వచ్చిన ప్రతి అవ్వాతాత, సోదరులు, స్నేహితులకు చేతు లు జోడించి కృతజ్ఞతలు తెలియచేస్తున్నా. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ప్రతి గ్రామానికి పౌర సేవలు, విద్య, వైద్యం, రైతన్నలకు భరోసా, అక్క చెల్లెమ్మ లకు సాధికారత, అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సేవలు అందించిన మన ప్రభుత్వానికి మద్దతు పలకడానికి మీరంతా సిద్ధమేనా? గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఏకంగా రూ.2.70 లక్షల కోట్లను ఒక్క రూపాయి కూడా లంచం, వివక్షకు తావు లేకుండా 130 సార్లు బటన్ నొక్కి పారదర్శకంగా నేరుగా అందించిన ఈ ప్రభుత్వానికి, మీ జగన్‌కు మద్దతుగా ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కేందుకు, మరో వంద మందికి చెప్పి నొక్కించడానికి మీరంతా సిద్ధమేనా?

**రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు..**

ఈ ఎన్నికల యుద్ధం కేవలం చంద్రబాబుకు, జగన్‌కు మధ్య జరుగుతున్నది కాదు. ఈ యుద్ధం చంద్రబాబు మోసాలకు, ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది ఇంటింటికి పెన్షన్ అందించిన ప్రభుత్వానికి, వాటిని ఆపిన బాబు దుర్మార్గాలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇది వారి మోసాలకు, మన విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఆ అబద్ధాల బాబుకు ఇద్దరు వంత పాడుతున్నారు. ఒకరు దత్తపుత్రుడు, మరొకరు ఆయన వదినమ్మ. ఈ ముగ్గురు కలిసి రోడ్లపై అబద్ధాల బుర్ర కథలు చెబుతున్నారు. 2014 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసగించిన చంద్రబాబు ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ నమ్మబలుకుతున్నారు.

**మంచి కొనసాగాలో వద్దో ఆలోచించండి..**

ఈ రోజు మీరంతా ఇంటికి వెళ్లాక కుటుంబ సభ్యులతో కలసి ఒక్క అంశంపై ఆలోచన చేయమని కోరుతున్నా. మీ బిడ్డకు ఓటు వేయడం అంటే గత 58 నెలలుగా జరుగుతున్న మంచిని మీరందరూ కొనసాగించేందుకే ఓటు వేసినట్లే. మీ బిడ్డకు కాకుండా చంద్రబాబుకు ఓటు వేయడం అంటే దాని అర్థం.. ఈ 58 నెలలుగా మీకు జరుగుతున్న మంచిని మీ అంతట మీరే మీకు వద్దని చెప్పినట్లేనని గుర్తుంచుకోవాలని కోరుతున్నా. 58 నెలల క్రితం మీ బిడ్డ మీ అందరి ముందు నిలబడి ఫలానాది చేస్తానని ఎన్నికల మేనిఫెస్టో తీసుకొచ్చాడు. మేనిఫెస్టోను బైబిల్, భగవద్గీత, ఖురాన్ మాదిరిగా భావించి 99 శాతం హామీలను అమలు చేసి మీ ముందుకు వచ్చి మరోసారి ఆశీస్సులు కోరుతున్నాడు.

**2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే..**

ఒక్కసారి 2014 ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే.. నాడు కూడా ఇదే కూటమి! మేనిఫెస్టో అంటూ రంగు రంగుల కాగితాలతో ప్రజల జీవితాలతో చెలగాటమాడారు. ఇదే చంద్రబాబు సంతకం చేసి దత్తపుత్రుడు, ప్రధాని మోదీ ఫొటోలతో పాంప్లెట్లు ముద్రించి ప్రతి ఇంటికి పంపారు. మీరు మర్చిపోతారేమోననే భయంతో టీవీలలో, పేపర్లలో ఊదరగొట్టారు. చంద్రబాబు నాటి మోసాల్లో ఒక్కసారి ముఖ్యమైన వాటిని మీకు గుర్తు చేస్తా.

- రైతులకు రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలు మాఫీ అయ్యాయా? ➤ పొదుపు సంఘాల రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేస్తామని చెప్పి కనీసం ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా? ➤ ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద బ్యాంకులో రూ.25 వేలు డిపాజిట్ చేస్తామన్నాడు. మీకుగానీ, మీ ఇంటి చుట్టుపక్కల వారికిగానీ ఎవరికైనా ఒక్క రూపాయి డిపాజిట్ చేశారా? ➤ ఇంటికో ఉద్యోగం లేదంటే రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లలో అంటే 60 నెలల పాటు నెలకు రూ.రెండు వేలు చొప్పున ప్రతి ఇంటికి రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులైన వారందరికి మూడు సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు ఇస్తామన్నారు. ఏ పేదవాడికైనా ఒక్కటంటే ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. మరి జరిగిందా?
- మహిళా ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మరి చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు.. మరి జరిగిందా?
- ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి గుంటూరులో ఏమైనా కనిపిస్తోందా?

**సెల్‌ఫోన్ లైట్లతో సంఘీభావం..**

వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్ బాగుండాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు లేని పాలన కొనసాగాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుపడాలన్నా, మన వ్యవసాయం, మన ఆస్పత్రులు బాగుండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలి. 175కి 175 అసెంబ్లీ సీట్లు, 25కి 25 పార్లమెంట్ సీట్లలో ఏ ఒక్కటీ తగ్గకుండా గెలిపించేందుకు మీరు సిద్ధమేనా? పేదల భవిష్యత్తు బాగుండాలని చేస్తున్న ఈ యుద్ధానికి మీరంతా సెల్‌ఫోన్లలో టార్చిలైట్లు వెలిగించి సంఘీభావం తెలియచేయాలి.

**పాలకుడు మోసగాడైతే...**

ఎలాంటి వారు రాజకీయ నాయకుడిగా ఉండాలి? ఎలాంటి వారిని మనం ముఖ్యమంత్రిగా తెచ్చుకోవాలన్న విషయంపై ప్రతి ఇంట్లో చర్చ జరగాలి. ఎందుకంటే మనం వేసే ఓటు ద్వారా రాబోయే ఐదేళ్ల జీవితం ఆ పాలకుడి చేతుల్లో పెడుతున్నాం. ఆ పాలకుడికి మంచి మనసు ఉండి మంచి చేస్తే మన జీవితాలు బాగుపడతాయి. ఆ పాలకుడు మోసగాడు అయితే మన బతుకులు అంధకారం అవుతాయి. పిల్లల జీవితాలు అస్తవ్యస్తం అవుతాయి. అక్కచెల్లెమ్మల బతుకులు అతలాకుతలం అవుతాయి. రైతన్నల జీవితాలు మోసపోయి ఆత్మహత్యల పాలవుతాయి. అవ్వాతాతల సంక్షేమం అడుగంటిపోతుంది. అందుకే ఈ వాస్తవాలపై ప్రతి ఇంట్లోనూ చర్చ జరగాలని కోరుతున్నా. గుంటూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న కిలారు రోశయ్య, అసెంబ్లీ అభ్యర్థులు నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్, మురుగుడు లావణ్య, మేకతోటి సుచరిత, అన్నాబత్తుని శివకుమార్, విడదల రజని, అంబటి మురళీకృష్ణ, మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీలు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నందిగం సురేష్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాళి గిరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, పార్టీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ, మందపాటి శేషగిరిరావు, బత్తుల దేవానంద్ తదితరులు ఏటుకూరు సిద్ధం సభలో పాల్గొన్నారు.

## తెలంగాణకు 8.5 టీఎంసీలు

▶ మొదటి పేజీ తరువాయి

గత అక్టోబర్‌లో చివరి సారిగా సమావేశమైంది. శ్రీశైలం ప్రాజెక్టు కనీస మట్టం (ఎండీడీఎల్)ను 805 ఫీట్లు, సాగర్ ఎండీడీఎల్‌ను 505 ఫీట్లకు నిర్ణయించి, వేసవి ఆవిరి నష్టాలను కూడా లెక్కగట్టి రెండు జలాశయాల్లో 92.78 టీఎంసీలు అందుబాటులో ఉన్నట్టు నిర్ధారించింది. అయినప్పటికీ మే మాసాంతం వరకు మొత్తంగా రెండు ప్రాజెక్టుల్లో 82.78 టీఎంసీలనే వినియోగించాలని అప్పట్లో కమిటీ నిర్ణయించింది. అందులో 2.78 టీఎంసీలను జూన్, జూలై తాగునీటి అవసరాల కోసమని రిజర్వ్ చేసింది. మిగిలిన 80 టీఎంసీల్లో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి కేటాయించిన విషయం విదితమే. కాగా కమిటీ నిర్ణయించిన కోటాకు మించి తెలంగాణ ఇప్పటికే 11 టీఎంసీలను వినియోగించుకుంది. ఏపీ కోటా మేరకు వినియోగించుకుంది. అయితే ఇరు రాష్ట్రాలు తాగునీటి అవసరాలకు అదనంగా జలాలను విడుదల చేయాలని బోర్డుకు విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలోనే కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంది. సమావేశంలో సాగర్ సీఈ అజయ్‌కుమార్, ఈఈ విజయ్‌భాస్కర్, కృష్ణా బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సల్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఏపీలో మంచినీటి కొరత ఎక్కువగా ఉంది: ఈఎన్సీ**

త్రిసభ్య కమిటీ సమావేశంలో కేవలం తాగునీటి అంశంపైనే చర్చించామని ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డి సమావేశానంతరం చెప్పారు. 2 రాష్ట్రాల అంగీకారంతో నీటి వాటాల పంపిణీ జరిగిందని తెలిపారు. ఏపీలో మంచినీటి కొరత కొంత ఎక్కువగా ఉందని వివరించారు.

# 'ఇంటర్' ద డ్రాగన్..

▶ మొదటి పేజీ తరువాయి



యాజమాన్యాలు చెప్తున్నాయి. కోవిడ్ సమయంలో కాలేజీల్లో పనిచేసే అధ్యాపకులు ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోయారని, కొరత కారణంగా ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తోందని అంటున్నాయి. నిర్వహణ భారం పెరిగిందని చెప్పుకొస్తున్నాయి.

**అఫిలియేషన్ ఫీజు పెంచకున్నా..**

రాష్ట్రంలోని ఇంటర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు మూడు కేటగిరీల కింద అనుబంధ గుర్తింపు (అఫిలియేషన్) ఇస్తుంది. ప్రతీ విద్యాసంస్థలో గరిష్టంగా 960 మందిని చేర్చుకునేందుకు అనుమతిస్తారు. అఫిలియేషన్ ఫీజు కింద ఏటా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలేజీల నుంచి రూ.1.20 లక్షలు, మున్సిపాలిటీల పరిధిలోని కాలేజీల నుంచి రూ.60 వేలు, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేస్తారు. రెండేళ్లకోసారి ఈ ఫీజులను సమీక్షించి పెంచాల్సి ఉన్నా.. ఇంటర్ బోర్డు కొన్నేళ్లుగా పెంచలేదు.

**50 శాతం దాకా పెంపు..**

సాధారణ జూనియర్ కాలేజీల్లో గత ఏడాది వరకూ గరిష్ఠంగా రూ.60 వేల ఫీజు ఉంటే.. ఈసారి రూ.90 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు చెప్తున్నారు. కార్పొరేట్ కాలేజీలు రూ.1.25 లక్షల నుంచి రూ. 2 లక్షలకుపైగా (కాలేజీని బట్టి) డిమాండ్ చేస్తున్నాయని.. అదే హాస్టల్‌నూ కలిపితే ఏకంగా రూ.3.25 లక్షల వరకు చెప్తున్నారని వాపోతున్నారు. కార్పొరేట్ కాలేజీలు ఫీజులు పెంచడాన్ని చూసి.. సాధారణ కాలేజీలు కూ దా పెంచుతున్నాయని చెప్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల పరిధిలోనూ వార్షిక ఫీజులను రూ.75 వేల కు తక్కువ వసూలు చేయడం లేదని అంటున్నారు. మరో వైపు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కుల ధరలు కూడా గత ఏడా దితో పోల్చితే 20శాతం మేర పెరిగాయని.. ప్రైవేటు కాలేజీల రవాణా, ఆటో చార్జీలు కూడా 30శాతం వరకూ పెంచారని తల్లిదండ్రులు చెప్తున్నారు. దీంతో ఇంటర్మీడియట్ విద్య కోసమే రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు.

**ఇంటర్ ఫీజుల తీరు ఇలా.. (రూ.లలో)**

| కాలేజీల తరహా | గత ఏడాది | ఈ సంవత్సరం |
|---|---|---|
| కార్పొరేట్ కాలేజీలు (డే స్కాలర్) | 1.25 లక్షలు | 2.25 లక్షలు |
| కార్పొరేట్ కాలేజీలు (విత్ హాస్టల్) | 2.25 లక్షలు | 3 నుంచి 3.25 లక్షలు |
| హైదరాబాద్‌లోని సాధారణ కాలేజీలు | 75 వేలు | 1.25 నుంచి 1.50 లక్షలు |
| సాధారణ కాలేజీలు (విత్ హాస్టల్) | 1.25 లక్షలు | 1.50 నుంచి 1.75 లక్షలు |
| మున్సిపాలిటీల్లో కాలేజీలు | 60 వేలు | 90 వేలు |
| మున్సిపాలిటీల్లో (విత్ హాస్టల్) | 90 వేలు | 1.25 లక్షలు |
| గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలు | 40 వేలు | 60 నుంచి 70 వేలు |

**అంత ఫీజు ఎలా కట్టగలం?**

ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన మా అబ్బాయిని చేర్పించాలంటూ ఓ ప్రైవేటు కాలేజీ సిబ్బంది వెంటపడ్డారు. అడ్మిషన్ కోసం వెళ్తే ఏటా రూ.2.25 లక్షల ఫీజు అని చెప్పారు. కావాలంటే ఓ రూ.25 వేలు రాయితీ ఇస్తామన్నారు. అంత ఫీజేమిటని అడిగితే ఈ ఏడాది ఖర్చులు పెరిగాయని, అందుకే ఫీజులు పెంచామని చెప్పారు. రెండేళ్లకు రూ.4 లక్షల ఫీజు ఎలా కట్టగలం. వేరే కాలేజీల్లో ఆరా తీసినా అడ్డగోలుగా పెంచారు. ప్రభుత్వం నియంత్రణ చేపడితే పేదలకు ఊరటగా ఉంటుంది.

– సుచిత్ర, ఇంటర్ విద్యార్థి తల్లి, హైదరాబాద్

**ఫీజుల నియంత్రణ అవసరం**

కొన్ని కార్పొరేట్ కాలేజీలు ఇష్టానుసారం ఫీజులు పెంచడం వల్ల అన్ని కాలేజీలూ ఆ నింద మోయాల్సి వస్తోంది. ప్రభుత్వమే కాలేజీలను కేటగిరీలుగా విభజించి, ఫీజుల నిర్ణయం చేయాలి. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి. పేదలకు ఇంటర్ విద్యను అందుబాటులోకి తేవడానికి ఫీజుల కట్టడి చట్టాలు అవసరం.

– గౌరీ సతీశ్, తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు

**కార్పొరేట్ ఆగడాలను అడ్డుకోరా?**

అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తవకుండానే ప్రైవేటు ఇంటర్ కాలేజీలు అడ్మిషన్లు చేపట్టడం చట్ట విరుద్ధం. దీనికితోడు పేదలు ఏమాత్రం భరించలేని విధంగా ఫీజులు పెంచడం దుర్మార్గం. పాలక వర్గాలు దీన్ని అడ్డుకోవడంలో విఫలమవుతున్నాయి. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి.. కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఫీజు దోపిడీని అడ్డుకోవాలి.

– చింతకాయల ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

**దోపిడీని నియంత్రించకుంటే ఆందోళన**

ప్రైవేటు కాలేజీల ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. సర్కారు నుంచి ఏ విధమైన ఆదేశాలూ లేకపోవడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. పేదలు భరించలేని విధంగా కాలేజీలు ఫీజులు పెంచుతున్నాయి. తక్షణమే నియంత్రణ చేపట్టాలి. లేని పక్షంలో ఆందోళనలు చేపడతాం.

– టి.నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి

**ఫిర్యాదులు వస్తున్నాయి.. పరిశీలిస్తున్నాం**

ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల పెంపుపై అన్ని వర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. నియంత్రణ కోసం ఏం చేయాలనేది పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఇంటర్ బోర్డ్ సిద్ధంగా ఉంది.

– జయప్రదాబాయి, ఇంటర్ బోర్డ్ సీనియర్ అధికారి

## మార్కెట్‌లోకి పల్సర్ నూతన మోడల్



పాలమూరు: బజాజ్ కంపెనీ నుంచి మార్కెట్‌లోకి కొత్త బజాజ్ పల్సర్ వచ్చింది. జిల్లాకేంద్రంలోని హరూన్ బజాజ్ షోరూంలో శుక్రవారం నూతన బజార్ పల్సర్ 150సీసీ అప్‌గ్రేడ్ మోడల్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం మేనేజర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త పల్సర్‌లో 150సీసీ అప్‌గ్రేడ్ చేస్తూ మార్కెట్‌లోకి తీసుకురావడం జరిగిందన్నారు. దీని ఎక్స్‌షోరూం ధర రూ.1,12,301 ఉందని, దీంట్లో బ్లూటూత్, యూఎస్‌బీ, డిజిటల్ కన్సోల్, ఆకర్షణీయమైన గ్రాఫిక్స్ ఉన్నాయన్నారు. మూడు రంగులలో అందుబాటులో ఉందని చెప్పారు.

# న్యాయం చేయండి సారూ..


వెంచర్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

- ప్లాట్లను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని వినతి
- అధికార బలంతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన

అచ్చంపేట రూరల్: అధికార పార్టీకి చెందిన కొందరు నాలుగు రోజుల కిందట తమ ప్లాట్ల హద్దురాళ్లను అక్రమంగా తొలగించారని శుక్రవారం అచ్చంపేటలో యజమానులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని సర్వేనంబర్ 26లో 2009లో ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. ఐదేళ్ల కిందట తమకు తెలియకుండానే అదే భూమిని యజమాని వేరే వారికి రిజిస్ట్రేషన్ చేశారని.. అప్పటి రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ధరణిలో తప్పుడు రికార్డులు సృష్టించి సర్వేనంబర్ 27/1గా సృష్టించి రికార్డులు తయారు చేశారని వాపోయారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా అక్రమంగా హద్దు రాళ్లను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. అధికార పార్టీకి చెందిన కొందరు చాలారోజులుగా తమను వేధిస్తున్నారని.. కొనుగోలు చేసిన వారిలో గిరిజనులు, బుడగజంగాలు, పేదలే ఉన్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్లాట్లలో రూ. వేలు వెచ్చించి బేస్‌మెంట్ నిర్మించామని.. కొందరు పనిగట్టుకొని యంత్రాల సాయంతో హద్దురాళ్లు, బేస్‌మెంట్, గుడిసెలను కూల్చడం సరి కాదని తెలిపారు.

**మా దృష్టికి రాలేదు..**



సర్వేనంబర్ 26, 27కు సంబంధించిన బాధితులు ఎవరూ మా వద్దకు రాలేదు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం అమ్రాబాద్ మండలంలో పర్యటించాం. గతంలో జరిగిన విషయాలేవీ తెలియవు. బాధితులు సమస్యను మా దృష్టికి తీసుకొస్తే విచారణ చేపడతాం.

– మాధవి, ఆర్డీఓ, అచ్చంపేట

**అక్రమంగా కూల్చారు..**



మా ప్లాట్ నంబర్ 37. కాయకష్టం చేసి కొనుగోలు చేసి బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్నా నాలుగు రోజుల కిందట కొందరు బేస్‌మెంట్, హద్దురాళ్లను తొలగించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడటం సరైంది కాదు.

– బక్కయ్య, బాధితుడు

**మా బిడ్డకు రాసిచ్చిన..**



కాలనీకి దగ్గరగా ఉందని ప్లాట్ నంబర్ 21ని కొనుగోలు చేశా. నలుగురు బిడ్డల్లో ఒకామెకు కట్నంగా ప్లాట్ రాసిచ్చా. పట్టణానికి సమీపంగా ఉన్న ప్లాట్లను ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పేదలనే కనికరం లేదు. అధికార బలంతో వేధిస్తున్నారు. న్యాయం చేయాలి.

– ఎల్లయ్య, ఇంద్రనగర్‌కాలనీ, అచ్చంపేట

# గుడిబండలో గుప్తనిధుల తవ్వకాలు

- సీసీ కెమెరాలు తొలగించిన దుండగులు


గుడిబండ దేవాలయంలో గుప్తనిధుల కోసం బండరాళ్లను ధ్వంసం చేసిన దుండగులు

బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూర్ మండలంలోని కొండనాగుల గ్రామ సమీపంలోని ప్రాచీన కాలం నాటి పెద్దగుడిబండ శ్రీరామలింగేశ్వరాలయంలో మరోసారి గుర్తుతెలియని దుండగులు గుప్తనిధుల కోసం గురువారం అర్ధరాత్రి తవ్వకాలకు పాల్పడ్డారు. ఈ విషయం శుక్రవారం ఆలయం వద్దకు వెళ్లిన పూజారి గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఆలయంలోకి ప్రవేశించిన దుండగులు అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తొలగించిన అనంతరం గర్భగుడి ఎదురుగా ఉన్న నంది విగ్రహం ఎదుట మూడు బండలను తొలగించారు. గుప్తనిధుల కోసం మట్టిని తవ్వి ఆ తరువాత యధావిధిగా మళ్లీ బండరాళ్లను పెట్టి వెళ్లిపోయారు.

**గతంలో కూడా పలుమార్లు..**

గుడిబండ శ్రీరామలింగేశ్వరాలయం గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలోని వ్యవసాయ పొలాల్లోని గుట్టపై ఉండటంతో అక్కడ రాత్రి అయ్యిందంటే ఎవరూ ఉండరు. అదే అదునుగా భావించిన దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పటి వరకు దుండగులు పదిసార్లు తవ్వకాలకు తెగబడి ఉంటారని గ్రామస్తులు తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆలయ కమిటీ వారు ఏడాది కిందట సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాని గురువారం రాత్రి తవ్వకాల కోసం వచ్చిన దుండగులు మొదటగా ఆలయంలో అమర్చిన సీసీ కెమెరాలతో పాటు రికార్డర్‌ను ధ్వంసం చేసి తవ్వకాలకు పాల్పడినట్లు అక్కడ ఉన్న అనవాళ్లను బట్టి తెలుస్తోంది. ఈ దేవాలయంలో ఇరవై ఏళ్ల నుంచి తరచుగా గుప్తనిధుల కోసం తవ్వకాలు జరగడం పరిపాటిగా మారగా.. ఇందులో విలువైన నిధులు కూడా ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాల్‌రాజు తెలియజేశారు.


ఆలయంలో అమర్చిన సీసీ కెమెరాలను తొలగించిన దుండగులు

# తాళం వేసిన ఇంట్లో చోరీ

- 3 తులాల బంగారం, రూ.35 వేల నగదు అపహరణ


బీరువాను పరిశీలిస్తున్న క్లూస్‌టీం, ఎస్‌ఐ రామన్‌గౌడ్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో తాళ్ల సత్యనారాయణ, ఎల్లమ్మలు రోజువారిలాగే ఉదయాన్నే లేచి వారు పొలం పనులకు వెళ్లారు. తాళం వేసిన ఇంటిని గమనించిన దొంగలు ఆ ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని ఉన్న ఉంగరం, కమ్మలు, తాళిబొట్టు, రూ.35 వేల నగదు చోరీ చేసినట్లు బాధితులు పోలీసులకు తెలియజేశారు. పొలం నుంచి ఇంటికి వచ్చి చూడగా.. తలుపులు తెరుచుకుని ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువా తెరిచి ఉండడం, దుస్తులు చెల్లాచెదరం కావడం చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి స్థానిక ఎస్‌ఐ రామన్‌గౌడ్ చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌టీంకు సమాచారం ఇచ్చి వారు వచ్చాక ఎస్‌ఐ రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నింటి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు 3 తులాల బంగారం, రూ.35 వేల నగదు చోరీకి గురైందని ఎస్‌ఐ తెలియజేశారు. చోరీపై విచారణ చేపడుతున్నామని, చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకొని సీసీ కెమెరాలు పరిశీలించి, దొంగలను త్వరలోనే పట్టుకుంటామని తెలియజేశారు.

# తనిఖీల్లో నగదు పట్టివేత


మన్ననూర్ వద్ద కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం/ మన్ననూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం అడ్డాకుల పోలీసులు రూ.63,500, నవాబుపేట పోలీసులు రూ.54,500 నగదు సీజ్ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తరలిస్తుండటంతో స్వాధీనం చేసుకొని జిల్లా అధికారులకు అప్పగించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అలాగే జడ్చర్ల, చిన్నచింతకుంట, రాజాపూర్, దేవరకద్ర పోలీసులు అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నారు.

**మన్ననూర్ వద్ద రూ.53 వేలు..**

శ్రీశైలం– హైదరాబాద్ ప్రధాన రహదారిలోని మన్ననూర్ బార్డర్ చెక్‌పోస్టు వద్ద రూ.53 వేల నగదు శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు అమ్రాబాద్ ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మన్ననూర్‌లోని చెరువు కొమ్ము లింగమయ్య వద్ద అటవీ శాఖ చెక్‌పోస్టు పోలీసుల సమక్షంలో ప్రతినిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో శ్రీశైలం వైపు వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన ఓ కారును తనిఖీ చేయగా నగదు ఉన్నట్లు గుర్తించామని, వీటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

## ఎండకు రక్షణగా.. కదిలిన కానుగ



ఏంటి కానుగ చెట్టు ట్రాక్టర్ ఎక్కిందనుకుంటున్నారా.. అవును నిజమే.. ఎండకు తట్టుకోలేక ట్రాక్టర్‌లో వెళ్లే ఇటుక బట్టీల కూలీలు కానుగ చెట్టు కొమ్మలను ట్రాక్టర్‌కు కట్టుకుని దాని నీడలో ప్రయాణిస్తూ ఎండ నుంచి ఉపశమనం పొందారు. చూసేందుకు ఆసక్తికరంగా కనిపించిన ఈ చిత్రాన్ని శుక్రవారం నవాబ్‌పేటలో 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– నవాబ్‌పేట